క్లుప్తంగా

రిజర్వేషన్లు సమానంగా కల్పించండి: గిరిజన నేతలు


ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్: సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని కులాలకు సమానమైన రిజర్వేషన్లు కల్పించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐఓసీ కార్యాలయం ఎదుట శనివారం గిరిజన సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2011 జనాభా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు పాత రిజర్వేషన్లు కల్పించి, బీసీలు, ఓసీలకు 2024 జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడం సరికాదన్నారు. 2011 తర్వాత వందలాది గిరిజన తండాలు పంచాయతీలుగా ఏర్పడ్డాయని, గిరిజన, దళితుల జనాభా పెరిగిందని చెప్పారు. పాత రిజర్వేషన్లు కల్పించడం వల్ల గిరిజనలు, దళితులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు తిరుపతి నాయక్, సత్యం నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితరులు ఉన్నారు.

సొంత నిధులతో పనులు


చెట్ల కొమ్మలను తొలగిస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని రేబర్తి వంగపల్లి గ్రామాల మధ్య రహదారికి రెండువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, పొదలను శనివారం తొలగించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, ప్రజాప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా స్పందించలేదని, దీంతో సొంత డబ్బులతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ చెట్ల వల్ల వాహనాలు రాకపోకలను ఆర్టీసీ అధికారులు నిలిపివేస్తున్నారని, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఏటీసీలతో బంగారు భవిష్యత్
ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

సిద్దిపేటరూరల్: అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ల ద్వారా విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని ఇర్కోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన ఏటీసీని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన విద్యార్థులు ఏటీసీలను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలన్నారు. ఆధునిక యంత్రాలు, డిజిటల్ నైపుణ్యాలు, ఇండస్ట్రియల్ టెక్నాలజీ, ఆటోమేషన్, ఎలక్ట్రానిక్స్ లాంటి రంగాల్లో ప్రతిభ కనబరిచేందుకు ఈ సెంటర్లు ఉపయోగపడతాయని చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పదో తరగతి పూర్తయ్యాక ఈ సెంటర్లలో చేరవచ్చని, మంచి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామానుజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు చేపట్టాలని వినతి

సిద్దిపేటరూరల్: గుర్రాలగొంది లక్ష్మీనరసింహా స్వామి ఆలయం వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ మాజీ సర్పంచ్ ఆంజనేయులు శనివారం పీఆర్ డీఈ చారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు రూ.1.05 కోట్లు మంజూరు చేశారన్నారు. దీనికి టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు కూడా ప్రారంభించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పనులు నిలిచిపోయాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు పనులు ప్రారంభించాలని కోరారు.

సీఎం రేవంత్ నుంచి నియామక పత్రాలు


నియామక పత్రం అందుకుంటున్న ప్రీతి

సిద్దిపేటజోన్: గ్రూప్–1 తుది జాబితాలో ఉద్యోగాలు పొందిన వారికి శనివారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. జిల్లాలోని అరుణ్ చంద్ర, అఖిల్, స్వామి, సచిన్, ప్రీతి పత్రాలను అందుకున్నారు.


సిద్దిపేట పట్టణంలో బతుకమ్మలతో యువతులు


దుబ్బాకటౌన్: ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో ..


కొమురవెల్లి(సిద్దిపేట): తపాస్‌పల్లిలో ..



జగదేవ్‌పూర్(గజ్వేల్): బతుకమ్మతో మహిళా కానిస్టేబుల్స్

తెలుగంటి పువ్వొప్పనే గౌరమ్మ..

బతుకమ్మ ఉత్సవాలు అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఏడో రోజు శనివారం బతుకమ్మకు నైవేద్యంగా పిండితో తయారు చేసిన వేపకాయాలను సమర్పించారు. యువతులు, మహిళలు తీరొక్క పువ్వులతో బతుకమ్మలను అందంగా పేర్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేసి సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువులలో నిమజ్జనం చేశారు.


హుస్నాబాద్: మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు


సిద్దిపేటకమాన్: కోర్టు ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తదితరులు


నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేటలో..


కొండపాకలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


పోలీసు కమిషనరేట్‌లో బతుకమ్మ వేడుకలు


కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

దారి ఇలా.. నిమజ్జనమెలా?


కంకర, మట్టి కొట్టుకొని పోవడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు


పాలమాకుల చెరువుకట్టపై ఏర్పడ్డ గోతులు

- పాలమాకుల చెరువుకట్టపై గోతులు
- కొట్టుకు పోయిన మట్టి, కంకర
- ఇబ్బందులు పడుతున్న మహిళలు

నంగునూరు(సిద్దిపేట): ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాలమాకుల ఊర చెరువు మత్తడి దూకడంతో నెల రోజులుగా మూడు గ్రామాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై గ్రామస్తులు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కాంట్రాక్టర్ చేత పైపులు, కంకర, మట్టి పోయించి తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. కానీ శుక్ర, శనివారాల్లో కురిసిన వానలకు ప్రవాహ ఉధృతి పెరగడంతో మట్టి, కంకర కొట్టుకొని పోయింది. దీంతో బతుకమ్మ నిమజ్జనం కోసం ఆ దారి గుండా వెళ్లే మహిళలు, చిన్నారులు ఇక్కట్లు పడుతున్నారు. అలాగే పాలమాకుల చెరువుకు వెళ్లే మట్టి రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు.

‘ఉపాధి’ సామాజిక తనిఖీ ప్రజావేదిక

- కూలీకి రానివారికి డబ్బులు విత్‌డ్రా
- పలువురికి జరిమానాలు


మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని 32 పంచాయతీల పరిధిలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. రూ.12 కోట్లతో పనులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. 25 వరకు డీఆర్పీలు, ఎస్ఆర్పీలు తదితర గ్రామాల్లో చేపట్టిన పనులను తనిఖీ చేశారు. పనుల్లో అవకతవకలు ఉన్నట్టు గుర్తించారు. మండల వ్యాప్తంగా సుమారు మూడు వేలకుపైగా మొక్కలు చనిపోయినట్లు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలు రాకుండానే డబ్బులు విత్‌డ్రా చేశారని డీఆర్పీలు గుర్తించారు. ఈ సందర్భంగా అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు పనుల్లో తేడాలు కనిపించడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సవరించుకోవాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి జరిమానాలు విధించారు. ఏపీడీ సతీశ్, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్, పంచాయతీ రాజ్ ఏఈ భిక్షపతి, అధికారులు సంతోష్, గణేశ్, ఆరీఫ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చందాలతో మరమ్మతులు చేసుకోవాలా?


లక్ష్మీదేవి చెరువును పరిశీలిస్తున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు

గజ్వేల్: ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల గజ్వేల్ మండలం పిడిచెడ్‌లో ప్రమాదకర స్థితిలో ఉన్న లక్ష్మీదేవి చెరువుకట్టను గ్రామస్తులు చందాలు వేసుకొని బాగుచేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవి చెరువును శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో సాగునీటికి పెద్దపీట వేశారన్నారు. ‘మిషన్ కాకతీయ’ పథకంలో భాగంగా కోట్లాది రూపాయలతో చెరువులను అభివృద్ధి చేస్తే ప్రస్తుత ప్రభుత్వం వాటికి మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితిల్లో ఉందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించపోవడం వల్ల గ్రామస్తులు రూ.1.5 లక్షలు చందాలు సేకరించి మరమ్మతులు చేసుకున్నారని, ఆ డబ్బులు ప్రభుత్వం తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్లేశం, వెంకటేశ్‌గౌడ్, ఇంద్రసేనారెడ్డి, ఎన్సీ రాజమౌళి, హన్మంతరెడ్డి, నాగిరెడ్డి, ప్రతాప్, కోటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల మున్సిపాలిటీలో స్వచ్ఛత పాఠాలు

- నేటి నుంచి 100 రోజుల పాటు
- జీహెచ్‌ఎంసీ మేయర్ సమక్షంలో ఒప్పందం



ఒప్పంద పత్రం అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ నాగేందర్

చేర్యాల(సిద్దిపేట): శానిటేషన్, వ్యర్థ నిర్వహణ, శుభ్రత చర్యలపై స్వచ్ఛ షెహర్ జోడి ఇనిషియేటివ్‌లో భాగంగా నిర్వహించే 100 రోజుల స్వచ్ఛత పాఠాలు చేర్యాల మున్సిపాలిటీలో నేర్చనున్నారు. ఈ విషయమై శనివారం హైదరాబాద్ జీహెచ్ఎంసీలో మేయర్ సమక్షంలో కమిషనర్ నాగేందర్ ఒప్పందం చేసుకున్నారు. స్వచ్ఛ్ భారత్ మిషన్ – అర్బన్ 2.0 కింద గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇటీవల ప్రారంభించిన ‘స్వచ్ఛ్ శెహర్ జోడీ’ కార్యక్రమంలో భాగంగా, జరిగే స్వచ్ఛత పాఠాలు మంథని మున్సిపాలిటీ, చేర్యాల మున్సిపాలిటీల్లో జరగనున్నాయి. ఘన వ్యర్థాల వర్గీకరణ, రవాణా, నిర్వహణ, శానిటేషన్, వ్యర్థజలాల నిర్వహణ, కార్మికుల సంక్షేమంపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. ఇది చేర్యాల ప్రగతికి దోహదపడనుంది.

సమస్యలు పరిష్కరించండి
హాస్టల్ కార్మికుల వినతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ కార్మికుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు శనివారం వారు వినతిపత్రం అందించారు. వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. జిల్లా నాయకులు రమేశ్, లక్ష్మి, సురేశ్, స్వామి, కనకయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుగా రెహమాన్


నూతన కార్యవర్గానికి సన్మానం

సిద్దిపేటజోన్: జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కలెక్టరేట్ పరిపాలనాధికారి అబ్దుల్ రెహమాన్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రాజేశం, అసోసియేట్ అధ్యక్షుడిగా రాజిరెడ్డి, ఉపాధ్యక్షురాలుగా మాధవి, కోశాధికారిగా బాలరాజు తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆయా మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ పోరాటం స్ఫూర్తిదాయకం

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకొన్నారు. వివిధ కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలకు నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయన పోరాట పటిమ, ఆశయాలు భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు.


హుస్నాబాద్: లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్/నంగునూరు(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్)/సిద్దిపేటకమాన్: హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తా, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, అఖిల భారత సహకార సంఘాల బలోపేతానికి కృషి చేశారన్నారు. పద్మశాలీ సేవా సంఘం నేతలు రాజయ్య, సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ స్వర్ణలత, శ్రీనివాస్, వెంకట రమణ, నాగభూషణం, శ్రీనివాస్, అనిల్, రాములు, సది తదితరులు పాల్గొన్నారు. అలాగే నంగునూరులో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఉపాధ్యక్షుడు సంగు పురేందర్, శ్రీనివాస్, సిద్ధు, రామలింగం, రవి, నరేందర్, రాజు, భాను తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని లద్నూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి శ్రీనివాస్, బాలసిద్దయ్య, సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట సీపీ కార్యాలయంలో అదనపు డీసీపీ కుశాల్కర్ లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ లక్ష్మణ్ బాపూజీ అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం కృషి చేసిన గొప్ప మహనీయుడన్నారు.

రేషన్‌డీలర్లను మోసం చేస్తున్న సర్కార్

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: రేషన్‌డీలర్ల సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాకలోని క్యాంపు కార్యాలయంలో శనివారం జిల్లా రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షుడు వంగరి నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లకు మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.5 వేలు గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమీషన్ ఇవ్వాలన్నారు. అలాగే ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కమీషన్ డబ్బులు బతుకమ్మ, దసరా పండుగకు ముందే చెల్లించాలని డిమాండ్ చేశారు. డీలర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు లక్ష్మారెడ్డి, నాగభూషణం, నారాయణరెడ్డి, నరేశ్, నగేశ్, కుమార్, నర్సింహులు పాల్గొన్నారు.


సిద్దిపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ

శ్రీమహాలక్ష్మి.. సంపదప్రదాయి

దేవీశరన్నవరాత్రోత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం వివిధ ఆలయాలు, మండపాలలో అమ్మవార్లు లలితా త్రిపురసుందరి, లక్ష్మీదేవి రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.


దుబ్బాకలో 101 రకాల ప్రసాదాలతో అమ్మవారికి నైవేద్యం


చిన్నకోడూరు(సిద్దిపేట): మైలారంలో మహిళల కుంకుమార్చన


జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌లో కుంకుమార్చన చేస్తున్న భక్తులు


మద్దూరులోని అమ్మవారి మండపం వద్ద..


మిరుదొడ్డి(దుబ్బాక): మోతెలో కాత్యాయనిగా దుర్గామాత


వర్గల్(గజ్వేల్): శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా వర్గల్ అమ్మవారు


మర్కుక్‌లోని విజయదుర్గ క్షేత్రంలో శాకాంబరిగా..